విచారణ జరిగేనా..?



2



2

ఫారెస్ట్ అధికారి బైకు దగ్ధం

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## యంగ్ ఇండియా స్కూల్ భవనానికి శంకుస్థాపన



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ మండలంలోని బెల్లాల్‌లో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శంకుస్థాపన చేశారు.


29-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## పది ఫలితాల్లో

# బాలికలదే పైచేయి

**పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మరోసారి బాలికలు పైచేయి సాధించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 37,484 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 35,748 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 17,588 మంది, బాలికలు 18,160 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఫలితాల్లో కామారెడ్డి జిల్లా 18వ స్థానంలో నిలవగా నిజామాబాద్ జిల్లా 27వ స్థానంలో నిలిచింది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

■ కామారెడ్డి జిల్లాలో 191 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత ■ కామారెడ్డి 97.47 శాతం, నిజామాబాద్‌లో 94.24 శాతం నమోదు

ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది పదో తరగతిలో కాస్త మెరుగైన ఫలితాలు వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 24,365 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 22,961 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 11,371 మంది బాలురు, 11,590 మంది బాలికలు ఉన్నారు. జిల్లాలో 94.24 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కామారెడ్డి జిల్లాలో మొత్తం 13,119 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,787 మంది పాసయ్యారు. ఇందులో 6,217 మంది బాలురు, 6,570 మంది బాలికలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 97.47 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

### కామారెడ్డి జిల్లాలో 191 స్కూళ్లలో..

కామారెడ్డి జిల్లాలో 97.47శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 191 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలో బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించగా సోషల్ వెల్ఫేర్ 99.46 శాతం, మోడల్ స్కూల్స్ 99.44 శాతం, ప్రైవేట్ స్కూల్స్ 99.42 శాతం, కేజీబీవీ 99.22 శాతం, రెసిడెన్షియల్ 98.57 శాతం, రెసిడెన్షియల్ మైనారిటీ పాఠశాలలు 98.3 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలలు 96.19 శాతం, ఎయిడెడ్ పాఠశాలలు 95.24 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 90.60 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల్లో బీసీ వెల్ఫేర్ 8, ట్రైబల్ వెల్ఫేర్ 4, సోషల్ వెల్ఫేర్ 6, మోడల్ స్కూళ్లు 3, ప్రైవేట్ పాఠశాలలు 47, కేజీబీవీ 17, మైనారిటీ రెసిడెన్షియల్ 3, జడ్పీ పాఠశాలలు 102, ప్రభుత్వ పాఠశాలలు 3 ఉన్నాయి.

### విద్యార్థుల మార్కులు ఇలా..

కామారెడ్డి జిల్లాలో ఎస్పీఆర్ పాఠశాలకు చెందిన సుహృత 590 మార్కులు సాధించింది. క్యూరీ 589, మహర్షి 587, లిటిల్ స్కాలర్స్ పాఠశాలకు చెందిన సుదీక్ష 587 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలైన దోమకొండ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని ప్రణవి 582, జడ్పీహెచ్ఎస్ జంగంపల్లి విద్యార్థిని సౌందర్య 580, జడ్పీహెచ్ఎస్ దోమకొండ విద్యార్థిని భవాని 577 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

### నిజామాబాద్ జిల్లాలో..


జిల్లాలో మొత్తం 629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఇందులో జిల్లాపరిషత్ పాఠశాలలు అత్యధికంగా 577 ఉన్నాయి. మిగితా వాటిలో సోషల్ వెల్ఫేర్ 6, రెసిడెన్షియల్ 3, కెజిబివి 15, ఒకటి మోడల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు 1, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు 13, ఒక ఆశ్రమ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 2, రెసిడెన్షియల్ మైనారిటీ పాఠశాలలు 10 ఉన్నాయి.

### ప్రభుత్వ పాఠశాలల్లో టాప్ ర్యాంకర్లు వీరు..

వర్ని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని రోతె శివాణి 586 మార్కులు సాధించింది. అలాగే వర్ని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని ముక్కెర తేజస్విని 583, ఎన్‌హెచ్ (బాలికలు) నిజామాబాద్ విద్యార్థిని మందపల్లి శ్రీలత 582 మార్కులు సాధించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 160 స్కూళ్లు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

### నిజామాబాద్‌లో మండలాల వారీగా ఫలితాలు..

ఆలూర్‌లో 95.47 శాతం, ఆర్మూర్‌లో 93.34, బాల్కొండలో 95.48, భీమ్‌గల్‌లో 98.4, బోధన్‌లో 93.22, చందూర్‌లో 98.47 శాతం, ధర్పల్లిలో 97.6, డిచ్‌పల్లిలో 97.51, డొంకేశ్వర్‌లో 98.99, ఇందల్వాయిలో 99.6, జక్రాన్‌పల్లిలో 99.63, కమ్మర్‌పల్లిలో 98.57, కోటగిరి 92.07, మాక్లూర్‌లో 89.86, మెండోరాలో 97.84, మోర్తాడ్‌లో 95.79, మోస్రాలో 92.71, మోపాల్‌లో 92.61, ముప్కాల్‌లో 100శాతం, నందిపేట్‌లో 95.99, నవీపేట్‌లో 91.27, నిజామాబాద్‌లో 87.13, నిజామాబాద్ నార్త్‌లో 93.56, నిజామాబాద్ రూరల్‌లో 97.81, పొతంగల్‌లో 81.03, రెంజల్‌లో 99.18, రుద్రూర్‌లో 89.8, సాలూరలో 85.93, సిరికొండలో 99.86, వేల్పూర్‌లో 98.38, వర్నిలో 94.19, ఎడపల్లిలో 84.63, ఎర్గట్లలో 98.73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాలో ఆయా మండలాలకు కలిపి 94.24శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.







## కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థుల ప్రభంజనం..

# స్టేట్ ర్యాంకులతో సత్తా..





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో నిజామాబాద్ కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్టేట్ ర్యాంకులతో సత్తా చాటారు. మరియా అరీష 589, సీహెచ్.వర్ష 588, బి.శ్రీకర్ 585, జాహ్నవి 583, కె.అక్షర 583 అత్యుత్తమ మార్కులు సాధించారు.

### స్కూల్ స్థాయి నుంచే..

కేవోఎస్‌లో స్కూలు స్థాయి నుంచే ఐఐటీ బోధనతో పాటు ప్రణాళికా బద్ధంగా బోధన సాగడంతో ఇంటర్మీడియట్‌లో జాతీయ స్థాయి ఐఐటీ మెడికల్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని విద్యాసంస్థల ఛైర్ పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. 2025, 2026 ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. తాజాగా విడుదలైన ఎస్సెస్సీ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ పాటు వివిధ స్టేట్ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

### ఉత్తమ బోధనా పద్ధతులతోనే..

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ సీహెచ్.రామోజీ రావు అభినందించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు విడుదలైన ఎస్సెస్సీ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ పాటు వివిధ స్టేట్ ర్యాంకులు సాధించామన్నారు. స్కూల్ స్థాయిలో ఉత్తమ విద్యాబోధన అందించడం వల్ల అత్యుత్తమ ఫలితాలు సాధ్యమన్నాయని వివరించారు. అలాగే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, జేఈఈకి సంబంధించి మెరుగైన విద్య బోధించడం వల్ల ఇటీవల జాతీయ స్థాయి ర్యాంకులు సాధించామని చెప్పారు.

### విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట

డైరెక్టర్ సీహెచ్.తేజస్విని మాట్లాడుతూ ఎస్సెస్సీ ఫలితాల్లో తమ విద్యార్థులు స్టేట్ ఫస్ట్ పాటు వివిధ స్టేట్ ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు తమ స్కూల్ నుంచే పునాదులు పడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటీవల విడుదలైన జాతీయ స్థాయి ఐఐటీ, మెడికల్ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు ర్యాంకులు సాధించారని వివరించారు. ఇందుకు తాము అందించే ప్రత్యేక బోధనా పద్ధతులు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఐఐటీ ఫౌండేషన్‌లో రాణించేలా ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పించడం వలనే ఇలాంటి అత్యుత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నామని పేర్కొన్నారు.

### విద్యార్థులకు సన్మానం

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు రామోజీ రావు, తేజస్విని, రాజా సన్మానించారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు సందీప్ కులకర్ణి, వి.రణదీశ్, ఫరీద్దుద్దీన్, నటరాజ్, చంద్రశేఖర్, సుచరిత, వైస్ ప్రిన్సిపల్ ప్రిన్సిపల్స్ కవిత, ఫణీంధర్ ఫణీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ భవనాలు: టీపీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ భవనాలు నిర్మించనున్నట్లు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కాంగ్రెస్ నూతన భవన నిర్మాణానికి మంత్రి సీతక్కతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మొదటి భవనానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం పూర్తయ్యాక రాహుల్ గాంధీ చేతులమీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. త్యాగాలకు మారుపేరు కాంగ్రెస్ అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దేశం కోసం ఎందరో కాంగ్రెస్ నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. కానీ దేశాన్ని బీజేపీ కులాలు మతాల పేరిట విభజిస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వందకు పైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ మొలకెత్తదని.. ఆ పార్టీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. కవిత పార్టీపై పీసీసీ చీఫ్ స్పందించారు. కవిత పార్టీని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే పదేళ్ల బీఆర్ఎస్ పాపపు పాలనలో ఆమె పాత్ర కూడా ఉందని వ్యాఖ్యానించారు. కవిత ప్రశ్నలకు జవాబు చెప్పలేక కేసీఆర్ సతమతం అవుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ భవనాలు ఏర్పాటు చెయ్యాలనేది ఎన్నో ఏళ్ల కల అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి తొలుత సొంత జిల్లాలో పార్టీ కార్యాలయానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, రత్నాకర్, కేశవేణు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది..: మంత్రి సీతక్క

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో తెలంగాణ దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సహకార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, దివ్యాంగుల కోసం సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల ఎదుగుదలకు అన్నిరకాలుగా సహాయసహకారాలు అందిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని, ఇటువంటి కార్యక్రమాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని చెప్పారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమాన్ని అత్యంత ప్రాముఖ్యం ఇస్తోందని పేర్కొన్నారు. వారికి అవసరమైన సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా స్వావలంబన దిశగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో వెనుకబడిన వర్గంగా కాకుండా సమాన హక్కులతో ముందుకు రావాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వారికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఆటో, వీల్‌చైర్స్, పలు సహాయక ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ప్రజావసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా..: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామబాద్ అర్బన్, రూరల్‌లో ప్రతి నివాస ప్రాంతానికి సమృద్ధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవిలో ఎక్కడ కూడా దాహార్తి సమస్య తలెత్తకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిజామాబాద్ అర్బన్, రూరల్‌లో నగర ప్రజలకు మంచినీటి కొరత రాకుండా చూడాలని అధికారులతో మంచినీటి సరఫరా స్థితిగతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. రానున్న రెండు, మూడు నెలలు ఎంతో కీలకమైనందున, నీటి సరఫరా విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతి నిధులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టే విషయాన్ని ప్రజలకు సైతం ముందుగానే తెలియజేస్తే వారు తగిన విధంగా సన్నద్ధం అవుతారని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ దిలీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవోలు, ఏఈలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



# విచారణ జరిగేనా..?



■ పోలీసులకు లభించిన దస్త్రాల్లో ఏమున్నాయి..? ■ స్టాంపులు ఎక్కడ తయారు చేయించారు..? ■ పలు శాఖల అధికారుల్లో ఆందోళన ■ నిష్పక్షపాత విచారణపై అనుమానాలు ■ కామారెడ్డిలో కలకలం రేపిన 'అక్షరటుడే' కథనం

### కలకలం రేపిన 'అక్షరటుడే' కథనం

కామారెడ్డి మున్సిపల్ అధికారి సంతకం ఫోర్జరీ అంశంపై 'బిల్లుల కోసం సంతకం ఫోర్జరీ' శీర్షికతో 'అక్షరటుడే' పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం కామారెడ్డిలో కలకలం రేపింది. ముఖ్యంగా అధికార, పోలీసు వర్గాల్లో ఇదే కథనంపై తీవ్రస్థాయిలో చర్చ సాగింది. అధికారులు, మున్సిపల్ కార్యాలయాల్లో 'అక్షరటుడే' కథనం క్లిపింగ్స్ చక్కర్లు కొట్టాయి. కామారెడ్డిలో ఇంత పెద్ద వ్యవహారం నడిచిందా అని పలువురు ముక్కున వేలేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాల్లో అధికారుల్లో ఫోర్జరీ అంశం అధికారులను ఆందోళనకు గురిచేసింది.

### దస్త్రాల్లో ఏమున్నాయి..?

ఫోర్జరీ కేసులో ఫిర్యాదు రాగానే విచారణ చేపట్టిన పోలీసులకు పక్కాగా సాక్షాలు లభించాయన్న టాక్ వినిపిస్తోంది. ఫోర్జరీకి పాల్పడిన వ్యక్తి కారులో వందలాది పత్రాలు లభించాయని, స్టాంపులు దొరికాయన్న ప్రచారం సాగుతోంది. అయితే సంబంధిత పత్రాల్లో ఏమున్నాయి. ఏ ఏ శాఖల అధికారుల ఫోర్జరీ పత్రాలు లభించాయోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**"ప్రభుత్వ నిధులను కాజేసేందుకు ఓ వ్యక్తి చేసిన ప్రయత్నం బట్టబయలైన విషయం తెలిసిందే. అధికారి సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తి జైలు పాలయ్యాడు. అయితే ఈ వ్యవహారంలో ఇంకా ఎంతమంది పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫోర్జరీ వ్యవహారంలో ఒక్కరి పాత్రే ఉండకపోవచ్చన్న చర్చ సాగుతోంది. తెరవెనుక సహకారం లేకుండా ఇంతటి దుస్సాహసం చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఫోర్జరీ కేసులో పూర్తిస్థాయి విచారణ జరిగితే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో నూతనంగా నిర్మించ తలపెట్టిమా పిరమిడ్ ధ్యాన మందిరం వివాదానికి కేంద్రబిందువుగా మారడం చర్చకు దారి తీసింది. మంచి ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమానికి ఫోర్జరీ మరక అంటుకోవడం దుమారం రేపుతోంది. బిల్లులు డ్రా చేయడానికి టీపీవో సంతకాన్ని ఫోర్జరీ చేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ కేసును వివిధ కోణాల్లో విచారణ జరపడానికి పోలీసు శాఖ రంగం సిద్ధం చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది.

### స్టాంపులు తయారు చేసిందెవరు..?

అయితే సాధారణంగా ఒక ప్రభుత్వ అధికారికి సంబంధించిన స్టాంప్ తయారు చేయాలంటే సదరు శాఖకు సంబంధించిన అనుమతి పత్రం ఉంటే తప్ప తయారు చేసే అవకాశం ఉండదు. అలాంటిది టీపీవో స్టాంప్ తయారు కావడం చర్చనీయాంశంగా మారింది. సదరు నిందితుని వద్ద లభించిన స్టాంపులు ఎక్కడ తయారు చేశారు.. ఎవరు చేశారు అనేది తెలియాల్సి ఉంది. ఇలా ఎంతమంది అధికారుల స్టాంపులు తయారు చేశారో తెలిస్తే ఎన్ని ఫోర్జరీ పత్రాలు సృష్టించారో తెలిసే అవకాశాలు ఉన్నాయి.

### అధికారుల్లో ఆందోళన..

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంతకం ఫోర్జరీ కేసు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తమకు తెలియకుండా ఎవరైనా స్టాంపులు తయారు చేయించి ఫోర్జరీ పత్రాలు సృష్టించారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పలు శాఖల్లో తిరస్కరణకు గురైన కేసులను తిరగదోడే పనిలో అధికారులు పడ్డట్టుగా తెలుస్తోంది. తిరస్కరణకు గురైన కేసులలో ఫోర్జరీ చేసి ఏమైనా అవకతవకలకు పాల్పడ్డారా తెలుసుకునే పనిలో పడ్డట్టుగా సమాచారం.

### తగలబడిన దస్త్రాలు..?

ఫోర్జరీ కేసులో నిందితుడిని రిమాండ్ చేసిన తర్వాత పోలీసులు అతని ఇంటికి విచారణకు వెళ్లారు. అయితే అప్పటికే పలు దస్త్రాలు, స్టాంపులు ఇంట్లో లేకుండా చేశారని సమాచారం. దాంతో పోలీసులు విచారణకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎలాంటి పత్రాలు, స్టాంపులు లభించలేదని తెలిసింది. పోలీసులు వెళ్లిన తర్వాత పోలీసుల కంట పడకుండా దాచిపెట్టిన దస్త్రాలు, స్టాంపులను ఫోర్జరీ నిందితునికి సహకరిస్తూ నమ్మకంగా ఉన్న వ్యక్తి వద్దకు తీసుకెళ్లగా వాటిని తగలబెట్టినట్టుగా తెలుస్తోంది. నిందితుడికి నమ్మకంగా ఉన్న సదరు వ్యక్తిని విచారిస్తే మొత్తం వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. బాధితులు కూడా ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది.

### కీలకం కానున్న పోలీసుల విచారణ

టీపీవో సంతకం ఫోర్జరీ కేసు మున్సిపల్ వర్గాల్లో కలకలం రేపింది. అయితే ఈ కేసులో పోలీసులు చేపట్టే విచారణ కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయి. పోలీసులకు లభించిన పత్రాలపై నిందితుడిని విచారణ జరిపేందుకు కస్టడీ పిటిషన్ వేయడానికి పోలీసు అధికారులు సన్నద్ధం అవుతున్నట్టుగా సమాచారం. పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతిస్తే వారికి లభించిన పత్రాలపై లోతుగా విచారణ జరిపే అవకాశాలు ఉన్నాయి. అయితే సదరు నిందితుడికి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవిలో ఉన్న ఓ ప్రజాప్రతినిధి అండ ఉందన్న టాక్ వినిపిస్తున్న తరుణంలో నిష్పక్షపాత విచారణ సాగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## వెల్లుట్లలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన నూతన గృహప్రవేశ ఇందిరమ్మ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. నెలచూపుల రమ్య, పసులాది మైసకల గృహప్రవేశ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఏఎంసీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత వెంకటరాం రెడ్డి, కాంగ్రెస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కుర్మ సాయిబాబా, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి తరపున నూతన దంపతులకు వస్త్రాలు అందజేసి సత్కరించారు. కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో జీవించాలని నాయకులు వారిని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ.. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

## డీసీపీ రతన్‌కుమార్‌కు వీడ్కోలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సామాన్య కుటుంబంలో పుట్టి ఎస్సై స్థాయి నుంచి డీసీపీ వరకు ఎదిగిన ఎల్లారెడ్డి పట్టణవాసి జొన్నలగడ్డ రంజన్ రతన్ కుమార్ పదవీవిరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగంలో డీసీపీగా పనిచేస్తున్న రంజన్ రతన్ కుమార్ ఈ నెలాఖరుతో 37 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటారు. దీంతో పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన బాల్య మిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని సన్మానించారు. అనంతరం డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టినా.. పోలీస్ ఉద్యోగం చేయాలనే గట్టి సంకల్పంతో ఉన్నత స్థాయికి ఎదిగానన్నారు. తన 37 ఏళ్ల సర్వీసులో నిస్వార్ధంగా విధులు నిర్వహించానని.. తాను పుట్టిన ఎల్లారెడ్డి గడ్డ మీద పదవీ విరమణ సభ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో రొడ్డ ప్రభాకర్, సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ సంజీవరావు, రతన్ కుమార్ మిత్రులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో బుధవారం 'మన ఊరు మన భద్రత మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. అటు తర్వాత గ్రామంలో ట్రాఫిక్ నియమనిబంధనలు, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, గ్రామ వీడీసీ సభ్యులు, వార్డు మెంబర్లు ఐకేపీ మహిళా సంఘాలు ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ నాయకుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు..



**అక్షరటుడే, ఆర్మూర్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పోరాడుతున్న తమను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆందోళన నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా విడుదల చేసే వరకు ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం చేస్తున్న వారిపై దమనకాండ కొనసాగించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అగ్గు క్రాంతి, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మీరా శ్రావణ్, షాహిద్ అలీ పాల్గొన్నారు.



## దొడ్డు వడ్లు కొనాలని వినతి

**అక్షరటుడే, మాక్లూర్:** కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలు గ్రామాల రైతులు కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గొట్టుముక్కల కొనుగోలు కేంద్రం పరిధిలో దొడ్డు రకం వరిని అధిక శాతం రైతులు పండించారు. కోతకోసిన ధాన్యాన్ని కొనుగోలుకేంద్రానికి తీసుకొచ్చి పక్షంరోజులు గడిచినా సరైన సమాధానం రావడం లేదని రైతులు మండిపడ్డారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.




## బూర్గుల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు

**అక్షరటుడే గాంధారి:** మండలంలోని బూర్గుల్ గ్రామంలో సర్పంచ్ సౌమ్య మోహన్, ఉప సర్పంచ్ శ్రీరాం సాయిలు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు, ప్రయాణికులు, రైతులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు తాగునీరు, మజ్జిగ, చల్లని నీటి సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు యువత పాల్గొన్నారు. సర్పంచ్ చేపట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని అభినందించారు. వేసవి కాలంలో ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని సర్పంచ్ తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పల్లికొండ గ్రామంలో ఓ యువకుడు మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివకుమార్ (25) కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం నొప్పిని భరించలేక రాత్రి సమయంలో తన ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లి కోటిపల్లి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమ్‌గల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఇంటర్నేషనల్ రన్నింగ్ ఛాంపియన్‌గా మధు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన బోరంచ మధు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ రన్నింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మధు ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్‌గా నిలిచాడు. చిన్నప్పటి నుంచి క్రీడల పట్ల ఎంతో మక్కువ చూపే మధు.. ఒకవైపు విద్యాభ్యాసం కొనసాగిస్తూనే పరుగు పందెంలో రాణిస్తున్నాడు. కష్టపడి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. పల్లెటూరు నుంచి అంతర్జాతీయ వేదికపై దేశానికి పేరు తేవడంతో పాటు తమ గ్రామానికి సైతం పేరు ప్రతిష్టలు తీసుకురావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పల్లికొండలో భారీ చోరీ..

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పల్లికొండ గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో చొరబడిన దొంగలు అందిన కాడికి దోచుకెళ్లారు. భీమ్‌గల్ ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెడ్డు బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి మేడపై నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున కిందికి వచ్చి చూడగా, ఇంటి తలుపు లు తెరిచి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లోని బీరువాను పగులగొట్టిన దుండగులు, అందులోని 5 తులాల బంగారు ఉంగరాలు, గొలుసులు, చెవి కమ్మలు, మాటీలు, వెండి వస్తువులతో పాటు ఇతర ఆభరణాలను దొంగిలించారు. కాగా.. క్లూస్ టీం వేలిముద్రలను ఇతర ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.





## ఫారెస్ట్ అధికారి బైక్ దగ్ధం..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ జిల్లాలో ఓ ఫారెస్ట్ అధికారి బైక్ దగ్ధమైంది. ఈ ఘటన సిరికొండ మండలం రావుట్ల ఫారెస్ట్ రేంజ్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రావుట్ల రేంజ్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ విధుల్లో భాగంగా రావుట్ల అటవీశాఖ రేంజ్ పరిధిలో మంగళవారం బీట్ ఆఫీసర్ కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది అడవిలో ఫుట్ పెట్రోలింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో బైక్‌ను కొద్దిదూరంలో నిలిపి ఉంచి అడవిలోకి తనిఖీల నిమిత్తం వెళ్లారు. కొన్ని గంటల అనంతరం తిరిగి వచ్చి చూడగా బైక్ పూర్తిగా దగ్ధమై ఉంది. వెంటనే మంటలను ఆర్పివేసిన సిబ్బంది తమ ఉన్నతాధికారులకు, సిరికొండ పోలీసులకు సమాచారాన్ని అందించారు. స్పందించిన సిరికొండ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బీట్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి బాధితులైన రమేష్, శ్రీకర్, రాములుకు బుధవారం ఎస్‌హెచ్‌వో అందజేశారు.